ఓం నమో భగవతే శ్రీరమణాయ

# రమణభాస్కర

## (జువ్వలపాలెంలో శ్రీనాన్నగారి ప్రవచనము, 1-11-1995)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

కొంతమందికి భక్తి ఉన్నా ఆడంబరము ఉంటుంది. ఆడంబరము అహంభావనను పెంచుతుంది. నిరాడంబరము అహంభావనను తగ్గిస్తుంది. మనకు భక్తి కలిగినా, సంపద కలిగినా అణిగి ఉండటం నేర్చుకోవాలి. అణిగి ఉన్నవాడు ఈశ్వరానుగ్రహానికి పాత్రుడవుతాడు. భగవంతుని అనుగ్రహంలేదు అని అనుకోవద్దు. ప్రయత్నం చేయండి అని భగవాన్ చెప్పారు. మీకు ప్రయత్నం లేని మూలంగా దేవుని అనుగ్రహము, ప్రేమ తెలియటంలేదు. ప్రయత్నంచేయండి దేవుని అనుగ్రహము, ప్రేమ మీకు తెలుస్తాయి.

అనుభవం నోటిలో రాదు. హృదయంలో వస్తుంది. నోటితో మాటలు చెప్పటం కాదు హృదయంలో పరమేశ్వరుని అనుభవించాలి. అనుభవ సారంలో ఈ మాట మునిగి నోరు పెగలి బయటకు రావాలి. మన నాలుక హృదయంలో ఉండాలి. మన నాలుక హృదయంలో ఉంటే మనం మాట్లాడే ప్రతీమాట జ్ఞానపరంగా ఉంటుంది, ఇతరుల మనస్సు చల్లబడటానికి సహకరిస్తుంది.

మన చేతులకు మురికి అంటుకుంటే సబ్బుతో తోముకుంటాము. మన అంతఃకరణములో మురికి ఉంటే మనంసాధన చేయటంవలన, భగవంతుని పట్ల ప్రేమ కలిగి ఉండటంవలన ఆ మురికి పోతుంది అని జ్ఞానానంద చెప్పారు. సబ్బు మన చేతిని ఉన్న మురికిని ఎలా పోగొడుతుందో అలాగే మనం చేసే సాధన అంతఃకరణములోని దోషములను తొలగిస్తుంది.

పరమ భక్తుడు, నిరాడంబరుడు ఒకడు ఆశ్రమానికి వచ్చాడు. అతను కుటుంబ సంబంధమైన దుఃఖముతో బాధపడుతున్నాడు. అభ్యాసము చేస్తే అన్ని దుఃఖాలను భరించే ఓర్పును, ధైర్యమును అభ్యాసము కలుగజేస్తుంది అని భగవాన్ చెప్పారు. నీవు నామమునకు, రూపమునకు పరిమితమై ఉంటున్నావు. ఇలా నామ, రూపములకు పరిమితమై ఉన్నంతకాలము దుఃఖము నిన్ను విడిచిపెట్టదు. నీవు సాధనా బలంచేత ఎప్పుడైతే నామ, రూప దృష్టిని అతిక్రమించావో అప్పుడు సత్య వస్తువు నీకు దర్శనమిస్తుంది.

ఎన్ని మాటలు చెప్పుకున్నా, ఎన్ని రచనలు చేసినా వస్తువు అనుభవంలోనికి వచ్చినపుడు సుఖం తెలుస్తుంది గాని ఖాళీ మాటలు వలన ప్రయోజనం ఏమి ఉంది. వస్తువు అనుభవంలోనికి రావాలి. వస్తువు అనుభవంలోనికి వచ్చినపుడు దానికి సంబంధించిన సుఖము శాంతి తెలుస్తుంది. నిజమైన సొమ్ము ఏమిటి అంటే అనుభవమే. ఇది ఖాళీ మాటల వలన రాదు. మనిషి పూర్వజన్మలలో ఏదైనా పుణ్యం చేసి ఉంటే, ఆ పుణ్యం అనే సొమ్ము దేవుని Bank లో ఉంటే దేవుడు మన హృదయంలోనే ఉన్నాడు కాబట్టి నీ హృదయంలో ఉన్న సుఖాన్ని నీకు అందజేస్తాడు. దీనికి పుణ్యమనే సొమ్ము ఉండాలి. భౌతికమైన కరెన్సీ నోటులు కావు.

ఏదైనా ఒక వస్తువు ఇవ్వాలి అనుకొన్నప్పుడు వారిని మన దగ్గరకు రప్పించుకోకుండా మనమేవారి దగ్గరకు వెళ్ళి మనం ఇస్తే వారు పుచ్చుకుంటారా, పుచ్చుకోరా అనే అనుమానంతోటి, ప్రీతితోటి ఇవ్వమని

ఉపనిషత్‌లలో ఒక మహర్షి చెప్పారు. దీనివలన అహంభావన రాదు. నీవు చేసే రచన, నీవు మాట్లాడే మాట, నీవు చేసే దానం సాత్వికంగా ఉండాలి. సాత్వికంగా ఉన్నది దేవుని Bankలో పడుతుంది. అది పుణ్యం క్రింద మారుతుంది. బాహ్యంగా ఉన్నకరన్సీ నోటులు బజారులో ఉన్న వస్తువులు కొనుక్కోవటానికి ఎలా ఉపయోగ పడతాయో అలాగే పుణ్యం అనే సొమ్ము నీలోపల ఉన్న సత్యవస్తువును తెలుసుకోవటానికి సహకరిస్తుంది.

అహంభావనతో పనిచేస్తే నామ, రూపదృష్టి దాటలేవు. నిన్ను నీవు మర్చిపోయి పని చేయాలి. నిన్ను నీవు మర్చిపోయి పని చేయాలి. నిన్ను నీవు మర్చిపోయి పనిచేస్తే అది పుణ్యం క్రింద మారుతుంది. పుణ్యం దేవుని స్వరూపమును తెలుసుకోవటానికి సహకరిస్తుంది.

దేహము ఈ భూమి మీదకు ఎందుకు వచ్చిందో ఆప్రారబ్ధము పూర్తి అవ్వగానే అది మరణిస్తుంది. నీకు కొత్త సంస్కారములు, వాసనలు రాకుండా ఉండాలంటే దేహముతో తాదాప్యం వదులుకోవాలి. ప్రారబ్ధములో నీకు గౌరవము వచ్చే యోగం ఉన్నా, ధనవచ్చేయోగం ఉన్నా నీ సంకల్పముతోగాని, నీ కోరికతో గాని సంబంధము లేకుండా అదివస్తుంది. మనం ఏమి అనుకొంటాము అంటే మనకు సంకల్పము లేకపోతే అదిరాదు, మనకు కోరిక లేకపోతే అది రాదు అనుకుంటాము. నీ సంకల్పమునకు, కోరికకు బలంలేదు. శక్తి ఈశ్వరుడిది. నీ కోరికకు బలంలేదు అని చెపుతున్నారు. నీకు వచ్చేకష్టాలకు,నీ ఇబ్బందులకు తలంపులే కారణము. తలంపులన్నీ అబద్దాలు. అసత్యంలోనుండి సుఖంరాదు. సత్యంలోనుండి సుఖం వస్తుంది. ఏదైతే సత్యమో అందులో నిలకడగా ఉండటానికి ప్రయత్నంచేయి.

దేహముతోటి, మనస్సుతోటి తాదాప్యం మనకు అనవసరము. ఎందుచేతనంటే అవి మనం కాదు. కానిదానిని అవును అనుకొన్నా అవ్వవు. నేను మనస్సును అనుకొన్నప్పుడూ నీవు ఆత్మవే, నేను దేహమును అనుకొన్నప్పుడూ నీవు ఆత్మవే. నీవు అనుకొంటే అనుకోవచ్చును. మనస్సు, దేహము మనతోటి 24 గంటలు ఉండవు. దేవుడు కూడా 24 గంటలు మనతో ఉండడు. గాఢనిద్రలో మనస్సుతోటి, దేహముతోటి, దేవుడితోటి ఉన్న సంబంధము తెగిపోతుంది. 24 గంటలు నీతో ఉండేది ఆత్మ ఒక్కటే.

దుఃఖము, దేహము, దేవుడు ఇవి అన్నీ మనస్సు యొక్క కల్పితములు. అంటే దేవుడులేడు అని అర్థంకాదు. ఉన్నది ఒకటే వస్తువు. అదే చైతన్యము. అదే ఆత్మ. దానికి నామము లేదు, రూపములేదు. నామ రూపములు లేని దానిని మనం అందుకోలేక పోతున్నాము. మనం అందుకోలేకపోతున్నామని ఆ వస్తువు గ్రహిస్తోంది. అందువలన ఆ వస్తువు మనలను చూసి జాలిపడి కేవలము మనపట్ల దయకారణంగా దేవుడిగా గురువుగా విషయీభూతం అవుతోంది. ఉన్నదానిని ఉన్నట్లుగామనం అందుకోలేకపోతున్నాము. దానిని అందుకోటానికి సహకరించటానికి ఏవస్తువు నయితే అందుకోలేకపోతున్నామో ఆ వస్తువే దేవునిగా నీకు కనిపిస్తోంది. చైతన్యము వేరు, చైతన్యము యొక్క మాట వేరుకాదు. ఆ చైతన్యమే దేహంధరించి మాట చెపుతోంది, వాడే గురువు.

ఫలితాన్ని enjoy చేయాలి అనుకొని పనిచేస్తాము. పనివలన వచ్చే ఫలితాన్ని enjoy చేస్తాము. మనకు కావలసినది perfection కాదు, Truth కాదు. మనకు కావలసినది enjoyment. ప్రతీ మనిషి ఎదురుగా రెండే ఉన్నాయి. (1) enjoyment (2) perfection. enjoyment మార్గంలోనికి వెళ్ళావా జననమరణ ప్రవాహములో కొట్టుకుని పోతావు. Perfection వైపుకు ప్రయాణించావా అమృతత్వము నిన్ను వరించి దాని స్వరూపము నీకు ఇస్తుంది.

తలంపు లేకుండా పనిలేదు, తలంపులేకుండా మాటలేదు. తలంపు వాసననుండి వస్తోంది. వాసన ఎక్కడనుండి వస్తోంది అనుకొంటున్నావు. పూర్వజన్మలో నీవు ఏదైతే అనుభవించావో ఆ అనుభవమే వాసన క్రింద మిగిలిపోయింది. ఆ వాసన నుండి తలంపువస్తోంది. వాసన నశింపజేయటం కోసమే స్వప్రయత్నం, పూజ, జపం, ధ్యానం. వాసన ఉంటే బంధము, వాసన క్షయిస్తే మోక్షము అన్నారు భగవాన్.

ఉన్నదేదోఉంది. దానికి లేకపోవటం అంటూ లేదు. లేనిదేదోలేదు. దానికి ఉండటం అంటూ లేదు. ఇది నిశ్చయము. ఇది గ్రహిస్తేనీకు మోక్షము అన్నాడు కృష్ణుడు. నీ హృదయంలో ఒకనిజం ఉంది. అదినీకు అనుభవంలోనికి రావటంలేదు. ఏ విషయాలు అయితే నా హృదయంలో ఉన్న నిజం నీకు అనుభవంలోనికి రాకుండా అడ్డువస్తున్నాయో ఆవిషయాలను వేరుతో సహా బయటకు లాగి కాల్చటానికే నీ సాధన. నీలో ఏ బలహీనతలు ఉన్నాయోచూసుకో. ఏ అలవాట్లు నిన్ను పీడిస్తున్నాయో చూసుకో. ఎవడి మటుకు వాడు చూసుకోవాలి.

మనకు సుఖప్రారబ్ధము ఉన్నప్పుడు ఇది అంతామన చేతులలోనే ఉంది అనిపిస్తుంది. మన ఊహలన్నీ కరిగిపోవటానికి కొన్ని క్షణాలు సరిపోతాయి.

పాత్రకు మసి ఉంది అనుకోండి ఎంతసేపు తోమమంటారు అంటే ఏమిచెపుతారు. మసిపోయేవరకూ తోమాలి. అలాగే నీ అంతఃకరణములో ఉన్న దోషములు తొలగేవరకూ సాధన చేయాలి. ఎంతకాలము పట్టినా అవి తొలగే వరకూ సాధనచేయవలసిందే. అవి తొలగే వరకూ మోక్షం లేదు.

నీ జీవితానికి ఒక గమ్యం ఉండాలి. మీరు పూజచేస్తున్నారు, జపం చేస్తున్నారు ఏమి సాధించటానికి చేస్తున్నారు. గమ్యం మీకే తెలియనపుడు ఎటు ప్రయాణం చేస్తారు. పూజకు, జపానికి గమ్యంఏమిటి? సాధనయొక్క ప్రయోజనం అంతా అహంభావన తొలగించుకోవటానికే. అహంభావన తొలగించుకోకపోతే వేరు తనం నశించదు. వేరుతనం నశిస్తేనే గాని సద్వస్తువు నీకు అనుభవంలోనికి రాదు. నిత్యముగా ఉన్నస్థితి, శుద్ధముగా ఉన్నస్థితి మీకు కలగాలంటే మీకు దేవుని ప్రసాదము కావాలి. ప్రసాదము అంటే పటికబెల్లంకాదు, అనుగ్రహము. ఆయన అనుగ్రహం ఎప్పుడు వస్తుంది అంటే ఆయనను తెలుసుకోవాలి అనే ప్రయత్నం మొదలు పెడితే ఆయన అనుగ్రహం వస్తుంది.

మీరు ధ్యానం చేసేటప్పుడు దేవుని ధ్యానం చేస్తున్నాము అని అనుకొంటున్నారు. కాని మీరు కోరికలను ధ్యానం చేస్తున్నారు. ఇది తప్పు అని అనటంలేదు, ఇది గమ్యం మటుకు కాదు అని భగవాన్ చెపుతున్నారు. మీరు ఒక కోరిక కోరుతున్నారు. నెరవేరుతుంది. దానిని అనుభవిస్తారు. దానిని అనుభవించటం వలన అదిపోతే ఏ గొడవలేదు. వాసనను మిగిల్చిపోతుంది. ఆవాసన మరో జన్మకు హేతువు అవుతుంది.

ఎంతో మంది మరణించటం చూస్తున్నప్పటికీ నేను మాత్రం ఉండాలి అనుకొంటూ ఉంటావు. ఎందుకు అలా అనుకొంటున్నావు? నీవు ఎవరవు? నీవు ఆత్మవు. అది ఎప్పుడూ ఉంటుంది. దానికి ఉండకపోవటం అంటూలేదు. అది నువ్వేకాబట్టి నువ్వు ఎప్పుడూ ఉండాలి అనుకొంటున్నావు. ఆత్మకు చావులేదు. అందువలన నేను చనిపోకూడదు అని నీకు అనిపిస్తోంది. ఉండటమే, శాంతిగా ఉండటమే, సుఖంగా ఉండటమే మీసహజ స్థితి కాబట్టి మీకు ఉండాలని ఉంది, శాంతిగా ఉండాలని ఉంది, [redacted].

మనలోపల ఉన్నవస్తువు Simpleగా ఉంది, normalగా ఉంది, naturalగా ఉంది కాబట్టి మనమాట, వస్త్రధారణ అన్నీకూడా Simpleగా ఉండాలి, naturalగా ఉండాలి. అలా ఉంటే మనస్సు వెళ్ళి గూటిలో పడి [redacted]. పోతుంది.

ఎవరైనా అశాంతిగా ఉంటే మీరు అశాంతిగా ఉన్నారేమిటి అని అడుగుతాము. మీరు సుఖంగా, శాంతిగా ఉన్నారు అనుకోండి. మీరు సుఖంగా ఉన్నారు, శాంతిగా ఉన్నారు ఏమిటి అని అడుగుతామా? అడగము. ఎందుచేతనంటే సుఖం, శాంతి అనేవి మన సహజ గుణాలు. ఇవి ఆత్మగుణాలు. మనమాట, చేత మనలను భగవంతునిలో ఐక్యం చేయటానికి సహకరించేవిగా ఉండాలి. అదేసాధన. పని చేసేటప్పుడు నిర్మలంగా చేయాలి. మీరు ఎప్పుడూ నిర్మలంగా ఉండండి, సహజంగా ఉండండి. అప్పుడు దేవుడు మీకు దారి చూపిస్తాడు. దేవుడు దారి చూపించటం అంటే మాయమీకు దారి ఇస్తుంది. మాయ దారి ఇచ్చినపుడు భగవంతునిలో ఐక్యం పొందుతారు.

అత్తగారు బాధపెడుతున్నారు, మావగారు బాధపెడుతున్నారు, ఇంటిలోని వ్యక్తులు బాధపెడుతున్నారు అని చెపుతూ ఉంటారు. వారు బాధపెడుతున్నారు, వీరు బాధపెడుతున్నారు అని అంటారు. ఎవరూ ఎవరినీ బాధపెట్టటం లేదు. వాడి గుణాలే వాడిని బాధపెడుతున్నాయి. మీరాగద్వేషములు పీడిస్తున్నంతగా ఇంటిలోని వ్యక్తులు ఎవరూ మిమ్మలను బాధపెట్టరు. ప్రతీ మనిషిని వాడి గుణాలే పీడిస్తున్నాయి. వాడి అలవాట్లే పీడిస్తున్నాయి. ఈ పీడనుండి బయట పడాలంటే దైవానుగ్రహం కావాలి.

సాధన చేసి గంటలు లెక్కపెడతారు. సాధన ఇష్టమైతే గంటలు లెక్కపెట్టటం దేనికి. సాధన చేసి గంటలు లెక్కపెడితే అది అహంభావనలోనికి వస్తుంది.

నీ హృదయంలో ఉన్న వస్తువు కృత్రిమంగా లేదు. అది సహజంగా ఉంది, నిశ్చలంగా ఉంది, నిర్మలంగా ఉంది. అందువలన నీవు కృత్రిమంగా ఉండడం మానివెయ్యి. నీ లోపల ఉన్నవస్తువు సహజంగా ఉంది కాబట్టి నీవు కూడా సహజంగా జీవిస్తే అది నీకు వ్యక్తమవుతుంది. మనం ఏదైనా చిన్న మంచిపని చేస్తే అందరికీ తెలియాలి అనుకొంటాము. ఇది కృత్రిమ జీవితము యొక్క లక్షణము. రమణ మహర్షిలో ఉన్న ప్రత్యేకత ఏమిటి అంటే ఆయనద్వారా మనకు ఏదైనా సహాయం అందినా మనకు తెలియాలి అని ఆయన అనుకోడు. మనం గుర్తించాలి అని ఆయన అనుకోడు. ఎందుచేతనంటే అక్కడ అహంభావన లేదు.

అందరికీ దేవుని తెలుసుకోవాలి అని ఉంది. ఎవడికీ తెలియటంలేదు. ఒక రామకృష్ణుడికో, ఒక రమణ మహర్షికో తెలియటం ఏమిటి? వారి హృదయంలోనే దేవుడు ఉన్నాడా. మనహృదయంలో దేవుడు లేడా అంటే మన హృదయంలోనూ దేవుడు ఉన్నాడు. ఎందుకు తెలియబడటంలేదు అంటే మనజీవితం సహజంగా లేదు, నిర్మలంగా లేదు అందువలన ఆయన తెలియబడటం లేదు.

పుస్తకం చదివేటప్పుడు మనస్సులో ఉన్న గొడవేపుస్తకంలో కనబడుతుంది. ఈ మనస్సును ఒక ప్రక్కకు పెట్టి, మనస్సులో ఉన్న గొడవలు ఒక ప్రక్కకు పెట్టి పుస్తకంలో ఏమి ఉందో తెలుసుకోవటానికి ప్రయత్నం చేయము. ముందు మన ఇష్టాలు, అయిష్టాలు ఒక ప్రక్కకు పెడితేగాని పుస్తకంలో ఉన్నది గ్రహించే శక్తి మనకు రాదు.

విన్నది పూరికేపోదు. నాలుగు మంచి మాటలు వింటారు అనుకోండి. అందులో కనీసం ఒక్కమాట అయినా Practice చేద్దాము అనిపిస్తుది. Practice వలన Perfection వస్తుంది. మనం కూడా బాగుపడాలి అనే బుద్ధి కలుగుతుంది.

అమ్మా నువ్వంటే నాకు చాలా ఇష్టం అని నోటితో చెపుతూ ఉంటారు. అమ్మ ఏదైనా చెపితే అది చెయ్యరు. మనం అటువంటి బుద్ధిమంతులము. దేవుడు అంటే మాకు ఇష్టము, దేవుని పూజలు చేస్తున్నాము

అని చెప్పేవారేగాని దేవుడు చెప్పిన పనిని చేస్తున్నాము అని చెప్పేవారు ఒక్కరూ కనబడరు. నీ మాటకు, చేతకు ఎంతో దూరం ఉంది. ఇంక దేవుడు దొరికేది ఏమిటి?

భగవంతుని మాటలు వినండి. మననం చేసుకోండి. గాలికి వదలి పెట్టవద్దు. దాని మీద ధ్యాస పెట్టుకోండి. మీధ్యాసే ధ్యానం క్రింద మారుతుంది. ధ్యానం మీ మనస్సును అంతర్ముఖపరుస్తుంది. అంతర్ముఖమైన మనస్సు ఆత్మాకారము చెందుతుంది.

గురువు అంటే ఆత్మ. గురువు చెప్పిన మాటలు వినాలి. చెవులతో వినటం కాదు. మనస్సుతో వినాలి. అక్కడ మనస్సు ఉండాలి. వినేది మనస్సు. చెవులు గోళాలు. స్మశానంలో చెవులు కాలిపోతాయి. కాని చెవులద్వారా వినేవాడు కాలడు. ఆ వినేవాడు ఈ జన్మలో ఆత్మలాభం పొందకపోతే మరు జన్మలో గురువు చెప్పినమాటలను క్రొత్త శరీరములో క్రొత్త చెవులతో వింటూ ఉంటాడు.

దేహాలు అనేకం మారుతూ ఉంటాయి. కాని లోపల ఉండే జీవుడు మారడు. దేహాలు మారితే మారనియ్యి. నువ్వు శ్రవణం చేయటం, మననం చేయటం మానవద్దు. ఇలా సాధన చెయ్యగా, చెయ్యగా నీ ప్రయత్నం చూసి నీలోపల ఉన్న సత్య వస్తువు నీకు ఎరుకపడుతుంది. ఆ వస్తువు ఎప్పుడైతే ఎరుకపడిందో అదే నీకు కడసారి జన్మ. ఇంక ప్రకృతిలోనికి రానక్కరలేదు. శవాలు మోయనక్కరలేదు. ఆత్మగురించి శ్రవణం చేస్తేనేగాని, ఆత్మగురించి మననం చేస్తేనేగాని దానిని పొందాలనే సంకల్పము మనకు రాదు.

ఇష్టాలు, అయిష్టాలు నిజం అని అనుకోవద్దు. మానవ మనస్తత్వము ఎలా ఉంటుంది అంటే వారి స్వార్ధమునకు ఉపయోగ పడితే ఇష్టపడతారు. ప్రేమిస్తున్నాడు అని మనం అనుకొంటాము. వారి స్వార్ధమునకు ఉపయోగించకపోతే అప్పుడే శత్రువు.

మీరు ఆత్మ విచారణను వదలివేసి నిరంతరము లోకవిచారణలో ఉండే బదులు ఒక గొర్రెను కొనుక్కొని దాని వెంట్రుకలు లెక్క పెట్టుకో అని చలంగారు చెపుతూ ఉండేవారు. మీకు కాలక్షేపం అవ్వటం లేదు అని లోకవిచారణ చేసే బదులు గొర్రె వెంట్రుకలు లెక్క పెట్టుకో అన్నారు. గొర్రె వెంట్రుకలు లెక్క పెట్టటం వలన లాభం లేకపోయినా నష్టం లేదు. కాని లోకంగొడవలు చెప్పుకోవటం వలన నష్టాలు వస్తాయి, పేచీలు దాని వలనే వస్తాయి. లోకం గురించి ఎవరైనా చెపుతూ ఉంటే వింటాము. ఎందుచేతనంటే లోకవాసన మనలో కూడా ఉంది కాబట్టి వింటున్నాము. నీకు లోకవాసన లేదు అనుకో లోకం గురించి ఎవడైనా చెపుతున్నా పట్టించుకోవు. నీకు లోపల ఇష్టం ఉంది కాబట్టి వింటున్నావు. ఒక్క ఆత్మగురించి తప్ప ఏ గొడవలు గురించి భగవాన్‌తో ప్రస్థావించినా ఆ గొడవ గురించి ఎవరు చెప్పమన్నారు అనే వారు భగవాన్.

తరించాలి అనే కాంక్ష నీకు ఉంటే నీవు గురువు దగ్గరకు వెళ్ళనక్కర లేదు, గురువే నీ దగ్గరకు వస్తాడు అన్నాడు రామకృష్ణుడు.

దేవుడు ఉన్నాడా, లేడా అంటే దేవుడు ఉన్నాడు అనుకొనే బ్రతుకు. దేవుడు లేడు అనుకో దానివలన నీకు నష్టం ఏమీ లేదు. దేవుడు లేడు అని బ్రతుకుతారు అనుకోండి అప్పుడు నిజంగా దేవుడు ఉంటే నీ చర్మం వలిచివేస్తాడు, నిన్ను చీకటిలోకాలకు పంపిస్తాడు అన్నారు ఆచార్యులవారు. దేవుడు లేడు అను కోవటం కంటే ఉన్నాడు అని బ్రతకటం మంచిది. దాని వలన మనకు ప్రమాదం లేదు. ఇప్పుడు దేవుడు లేడు, మనం ఉన్నాము అని మనకు అనిపిస్తోంది. దేవుని తెలుసుకున్నాక ఉన్నది దేవుడే మనం లేము అని తెలుస్తుంది.

మన మనస్సు ఎలా ఉంటుంది అంటే రోజూ మాట్లాడే వారు మాట్లాడకపోతే కంగారు వచ్చేస్తుంది. నిజంగా వారికి కోపం వచ్చి మాట్లాడలేదు అనుకోండి మీకు వచ్చే నష్టం ఏమిటి? ఇలా మనకు కంగారు వస్తూ ఉంటే మనం స్వతంత్రులము కాదు అని అర్థము. లోపల ఉన్న సత్యం nakedగా ఉంది అలా నీ మనస్సును కూడా nakedగా చెయ్యి.

గదినిండా సామానులు పెట్టి ఎవరైనా వచ్చినపుడు లోపలకు రండి, కూర్చోండి అంటే అర్థం ఏముంది. వాడికి కూర్చోవటానికి చోటు ఉండాలి కదా. పొమ్మని చెప్పకుండా చెప్పటం అన్నమాట. అలాగే నీ హృదయం అంతా కలుషితం అయి ప్రాపంచిక వాసనలతో నిండి ఉంటే దేవుని రండి. రండి అంటే ఆయనకు చోటు ఉండాలికదా. నిరంతరము రాగద్వేషములతో, లోకం గొడవలతో కాలిపోతూ ఉంటే దేవుని రండి అంటే ఆయనకు స్థానం ఎక్కడ ఉంది? ఎవడైనా వాడి హృదయంలో దేవునికి చోటు ఇస్తున్నాడా? 24గంటలు దేహం గొడవ, లోకం గొడవ తప్పక దేవుని గొడవ ఎవరికీ లేదు.

నీవు చేసేపని హృదయపూర్వకంగా చెయ్యి, విశ్వాసంతో చెయ్యి. ఫలితమును కోరవద్దు. వచ్చేది ఏదో వస్తుంది, రానిది ఏదో రాదు. ఫలితము రావలసి ఉంటే కోరినా వస్తుంది, కోరక పోయినా వస్తుంది. కోరికతో వచ్చిన ఫలితము నీ మనస్సును పాడుచేస్తుంది. కోరకుండా వచ్చిన ఫలితము నీ మనస్సును పాడు చెయ్యదు.

జ్ఞానం యొక్క గొప్పతనం గురించి, జ్ఞానం యొక్క విలువ గురించి శ్రవణం చెయ్యి. శ్రవణం చెయ్యగా చెయ్యగా జ్ఞానం ఇంత గొప్పదా, జ్ఞానం మనం కూడా సాధించాలి అనే బుద్ధి కలుగుతుంది. జ్ఞానమును సంపాదించాలి అనే కాంక్ష నీ హృదయంయొక్క లోతులలో నుండి రావాలి. ఎవరో చెప్పటం వలన కాదు.

నీ దేహము, నీ అహంభావన, నీ గుణాలు నీకు ఎలా అనుభవంలో ఉన్నాయో అలాగే భగవంతుడు అనుభవంలోనికి రావాలి. అది ప్రత్యక్షానుభవం. అప్పుడు సుఖం అంటే ఏమిటో నీకు తెలుస్తుంది.

ఆత్మ అయి ఆత్మ గురించి చెప్పాలి. అప్పుడు శ్రవణం చేసి, మననం చేసి ఆత్మలాభమును పొందుతారు. ఏ లాభమును పొందిని తరువాత దానికి మించిన లాభము ఈ లోకములోగాని, పరలోకములోగాని లేదని మనకు తెలుస్తుందో అటువంటిది ఆత్మలాభము. అన్ని లాభములలోకి ఉత్తమమైనది, ఉదాత్తమైనది ఆత్మలాభము. అది ఎవరో అనుకొంటున్నావేమో అది నీవే.